బాలమిత్ర , అక్టోబరు – 1991, పుట : 10-12, జి. రామలక్ష్మి - హైదరాబాదు

## అసలు విషయం

అరవయ్యేళ్ళ వయసు వాడయినా అలా కనిపించక, నలభైయ్యేళ్ళ వాడిలా ఉంటూ యౌవనంగా, హుషారుగా, చెలాకీగా ఉండే ఆనందయ్య మంచం పట్టడం, పెద్ద చదువులకై ఊళ్ళకి వెళ్ళిన తన ముగ్గురు మగ పిల్లలకి ఆశ్చర్య మనిపించింది. కనీసం తల నొప్పయినా వచ్చి ఎరుగని ఆనందయ్య మరణావస్థతో సతమతమవుతున్నాడని - తమని వెంటనే బయలుదేరి రమ్మని రాసిన ఉత్తరాలు - మరీ ఆశ్చర్యం, విచారం కలిగించి పరుగున పక్షుల్లా రెక్కలు కట్టుకు వాలిన కొడుకులు రామనాథం, సోమనాథం. రంగనాథం, తండ్రి స్థితిని, అతని అవస్థను చూసి దిగ్భ్రాంతి చెందారు. ‘‘తాము రెండు నెలల క్రితం వచ్చినప్పుడు తండ్రి బాగానే హాయిగా, ఆనందంగా, చలాకీగా తిరుగుతన్నాడే - ఇంతలో ఏమయిందబ్బా? వైద్యుడు కూడా ఆయనలో ఏం రోగం లేదని కచ్చితంగా చెప్పాడు!’’ అని ఒకరినొకరు ప్రశ్నించుకుంటూ ముగ్గురూ కలిసి ఏకాంతంగా ఆలోచించసాగారు - తండ్రికి వినబడకుండా.

ఆఖరి వాడు రంగనాథం, ‘‘అన్నలారా, మీరేం కంగారుపడకండి! ‘అసలు విషయం’ ఆరాదీసి, రోగానికి తగ్గ మందు నేను వేసి, నాన్నకు నయం చేసి, తిరిగి మామూలు మనిషిని చేస్తాను!’’ అన్నాడు ఆఖరిగా.

‘‘సరే తమ్ముడూ! మన ముగ్గురిలో నీవే కాస్త ఎక్కువ తెలివైన వాడివి కూడా!’’ అన్నారు తమ్ముడ్ని ప్రోత్సహిస్తూ.

రంగనాథం తల్లిని పక్కకు తీసుకు వెళ్ళి, ఎన్నో విషయాలు ఆరాదీసాడు. తల్లి ఆశ్చర్యపోతూనే అన్నీ చెప్పింది. గత రెండు నెలలుగా జరిగినవన్నీ విని, రంగనాథం విషయం గ్రహించి, ఆలోచించి ఓ ఉపాయం పన్నాడు.

ఓ వారం గడిచినా, తండ్రి పరిస్థితిలో మార్పు లేదు; అలాగే ఉన్నాడు. అందరూ కలిసి హాలులో తండ్రి ప్రక్కన కూర్చున్నారు. పక్కన తల్లి కూడా ఉంది. ‘‘బాబూ! జోస్యం చెప్తానండీ, జోస్యం! ఉన్నది ఉన్నట్లుగా, లేనిది లేనట్లుగా, నమ్మకంగా, కళ్ళకు కట్టినట్లుగా, అంతా నిజంగా చెప్పగలనండీ... జోస్యం బాబూ, జోస్యం!’’ అంటూ ఓ కొండదొర ఇంటి ముందు ఆగి పిలసాగాడు. ‘‘వెళ్ళవయ్యా వెళ్ళు; మా తలరాత బాగోలేక మేము ఏడుస్తోంటే, మధ్య నీ జోస్యం ఎవరిక్కావాలి?...’’ అంది తల్లి రాములమ్మ.

''పోవయ్యా.... పో....'' చీదరించుకున్నారు పిల్లలు ముగ్గురూ. రంగనాథమయితే, తలుపు వేసేయబోయాడు!.

''నాయనా, రంగనాథం! ఆ కొండదొరని పిలు నాయనాఏ!. నాకు 'జోస్యం' చెప్పించుకోవాలని ఉంది.'' అన్నాడు ఆనందయ్య మంచం మీద చచ్చీ చెడీ లేచి కూర్చుంటూ!

''ఎందుకు నాన్నా వాడు? వాడి మొఖం వాడేం చెప్తాడు?'' అన్నాడు రంగనాథం.

''పోనీ పిలవరాదురా - ఈయన తృప్తి కోసం!'' అన్నలు అన్నారు రంగనాథాన్ని మందలిస్తున్నట్లుగా.

''అయ్యగారు మంచాన పడ్డారు. ఆరువారాల నుంచి, అప్పుడే నేర్చుకొంటున్న కొండ వాడొకడు వచ్చి జోస్యం చెప్పింది నమ్మి, నిజమని భ్రమించి మంచానకరుచుకు పోయిండు, నే రాసిస్తా - యింకా మూడు పదుల వయసు బతికుంటాడని. మా రాజు జాతకం మా గొప్పది. ముగ్గురు మగ పిల్లల ఈ తండ్రికి ఎనుమదేళ్ళు నిండందే చావురాదు; ఇది మా కొండ దొరసాని కొండ దేవర ఆజ్ఞ!'' అన్నాడు.

''ఆఁ, నిజమా!'' అంటూ చటుక్కున లేచి కూర్చున్నాడు ఆనందయ్య.

''అవును! నా మాట నిజం. ఈ తాయత్తు కట్టి మళ్ళీ వారమాగి వస్తా - చూడు - నీవెలా లేచి తిరుగుతావో!'' అంటూ తాయత్తు కట్టి వెళ్ళాడు - ఆ కొండదొర.

ఆనందయ్య రోగం నయం అయింది. మళ్ళీ మామూలు మనిషయ్యాడు. కులాసాగా పొలం పనులు చూసుకోసాగాడు.

తిరుగు ప్రయాణంతో ''నాన్న జోస్యం నమ్మే మంచాన పడ్డాడు. తిరిగి ముల్లును ముల్లుతోనే తీసినట్లు అసలు సంగతి అమ్మ ద్వారా ఆరాదీసి, నా స్నేహితునికి ఎలా, ఏం చేయాలో నేర్పి జోస్యం చెప్పించాను. మొదటి వాడు ఆరు నెలల్లో చస్తావని చెప్పగానే నమ్మి, నిజమనుకుని లేని రోగం, నీరసం, తెచ్చుకునీ మరీ చావటం తప్పదన్నట్లుగా మంచం ఎక్కాడు నాన్న. నేను మరో జోస్యం ద్వారా ఎనభై ఏళ్ళు పోయిస్తూ, దొంగ తాయత్తు కట్టించి, దీర్ఘాయుస్సు అని చెప్పించేసరికి ఈ జ్యోతిష్కుడి మాట నిజం - అని అనుకుని, తనకు తానే అన్నేళ్ళ ఆయుస్సు తనకుండగా, ఈ రోగమేమిటి మధ్యలో?'' అని అనుకుని తినీ, త్రాగీ బాగా కోలుకున్నాడు. అదీ సంగతి ఇంతకీ అతను నా స్నేహితుడే అనీ నాన్నకు తెలియదు!'' అంటూ నిజం చెప్పాడు అన్నలతో రంగనాథం.

''పోనీలే తమ్ముడూ, మంచి పని చేసావ్, తెలివిగా ముల్లును ముల్లుతోనే నయం చేసి రోగం కుదిర్చావ్!'' అని అన్నలు అభినందించారు. ''అందుకే, జోస్యమన్నది కరెక్టుగా ఎవరూ ఎవరికీ చెప్పలేరు. అందులోను ఆయువు విషయంలో మరీను! కాబట్టి ఎవరేం చెప్పినా నమ్మకూడదు. ఎవరి రాతను ఎవరూ చదవలేరు. సవరించలేరు. పొట్టకోసం రోడ్ల మీద తిరిగే ఈ చిలుక జోస్యము, కొండ జాతులు, కోకొల్లలు! వారి ఉచ్చుల్లో పడిన వారి గతి నాన్నలాగే ఉంటుంది'' అన్నాడు రంగనాథం.

రంగనాథం చెప్పినదంతా విని ''ఆవును, నీ తెలివి అమోఘం!'' అని తమ్ముడ్ని ఎంతగానో మెచ్చుకుని సంతోషించారు ఇద్దరు అన్నలు.

రాజయ్య రామయ్య ఇరుగు పొరుగువాళ్ళు! అయినా వాళ్ళిద్దరి మధ్య పచ్చగడ్డేస్తే భగ్గుమంటుంది. రామయ్య రెక్కల కష్టంతో బాగా ఆర్జించి చాలా గొప్పవాడయి, ఇల్లూ, వాకిలీ, పొలం - పుట్రా చూస్తుండగానే సంపాదించేసాడు. బద్ధకస్తుడయిన రాజయ్య 'ఎక్కడేసిన గొంగళి అక్కడే' అన్నట్లు ఉన్నాడు. తన బద్ధకాన్ని గురించి తాను తిట్టుకోలేక సమర్థతతో ఆర్జించుకుని, గొప్పవాడయిన రామయ్యను చూసి కుళ్ళిపోసాగాడు.

ఒకసారి తన మామగారికి సుస్తీ చేసిందని భార్యా, ఇద్దరు కొడుకులను వెంటబెట్టుకుని బయలుదేరుతూ, రామయ్య యింటికి వచ్చి, ''రామయ్యా, మా మామకు సుస్తీ చేసిందట! మేము అర్జంటుగా ఊరెళ్ళి వస్తాము. అసలే ఈ వూళ్ళో దొంగల భయం ఎక్కువగా ఉంది. కాబట్టి, ఈ గొలుసు, ఉంగరం వెయ్యి రూపాయల నగదు నీ దగ్గర దాచుకుందామని వచ్చాను. దయ ఉంచి యివి ఉంచు నీ దగ్గర, వచ్చి తీసుకుంటాను!'' అన్నాడు.

''దానిదేముందిలే రాజయ్యా, వెళ్ళిరా! వచ్చాక నీ నగలు, డబ్బు తీసుకుందువుగాని! నా సొమ్ముకన్నా పదిలంగా నీ సొమ్ము దాచి ఉంచి, రాగానే నీవి నీకు యిచ్చేస్తాను!'' అన్నాడు.

రాజయ్య ఊరు వెళ్ళి ఓ పది రోజుల తర్వాత వచ్చాడు. వస్తూనే తన సొమ్ము, డబ్బు యిమ్మని అడిగి తీసుకుని, ''ఇదేమిటి వెయ్యి రూపాయలే యిచ్చావు! నేనిచ్చినది మూడు వేలు కదా! మిగతా రెండు వేలు ఏవి?'' అని అడిగాడు. దానికి రామయ్య ఆశ్చర్యపోయి, కంగారుపడుతూ, ''మర్చిపోయావా రాజయ్యా, నీవు ఒక గొలుసు ఒక ఉంగరం, వెయ్యి రూపాయల నగదు మాత్రమే నా వద్ద ఉంచి వెళ్ళావు. ఇప్పుడు మాట మార్చి మూడు వేలంటే, నేనెక్కడి నుంచి తెచ్చివ్వగలను?'' అన్నాడు.

‘‘చాలు చాల్లేవయ్యా.... మూడు వేలకు ఒక వెయ్యి చేతిలో పెట్టి బుకాయిస్తున్నావు. నాకు గానీ వళ్ళు మండిరదంటే, న్యాయాధికారి దగ్గరకు లాక్కెళ్ళుతా, జాగ్రత్త!’’ గదమాయించాడు రాజయ్య.

అప్పటిదాకా అంతా విన్న రామయ్య కొడుకు, ‘‘ఏందయ్యా, అప్పటి నుంచి చూస్తున్నా నీవాలకం? వెయ్యి దాచి మూడు వేలంటూ బుకాయిస్తున్నావే?’’ అంటూ గబుక్కున అతని చేతిలో తన తండ్రి ఉంచిన వెయ్యి, గొలుసు, ఉంగరం కూడా లాక్కుని, ‘‘పో అసులు నువేమీ మా దగ్గర దాచలేదు. నీకు దిక్కున్న చోటికి పోయి చెప్పుకో!’’ అన్నాడు రాజయ్య.

‘‘ఓరి నాయనో, ఓలమ్మో’’ అనుకుంటూ న్యాయాధికారి యింటికి పరుగెత్తి అంతా చెప్పుకుని, లబోదిబో మంటూ మొత్తుకున్నాడు.

అంతా విని న్యాయాధికారి రామయ్యని, అతని కొడుకుని తక్షణం పిలిపించాడు.

‘‘ఏమిటి రామయ్యా, రాజయ్య చెప్పిందంతా నిజమేనా?’’ అని అడిగాడు పది మందిలో నిలదీసి.

‘‘రామ రామ, అసలు అతను మా యింటికే రాలేదండీ! అలాంటిది అది నా దగ్గర దాచాడంటే మీరు మాత్రం ఎలా నమ్ముతున్నారండీ?’’ అని అన్నాడు రామయ్య.

రాజయ్య, ‘మొదటికే మోసం వచ్చిందన్న సంగతి గ్రహించి, వీళ్ళిద్దరూ నన్ను మోసం చేస్తున్నారు; ఉంగరం, గొలుసు, వెయ్యి, కాదు - కాదు మూడువేలు దాచానండీ రామయ్య దగ్గర!’’ అన్నాడు కంగారుగా తొట్రుపాటు పడుతూ.

‘‘చూసారుగా కంగారులోనయినా వెయ్యి అన్న పదం కక్కాడురాజయ్య. నిజం అతని చేతే ఒప్పించండి!’’ అన్నారు తండ్రి కొడుకులిద్దరూ.

‘‘న్యాయాధికారి నన్న భయం - భక్తీ లేకుండా నిజం కప్పిపుచ్చి అబద్ధాలాడుతున్నందుకు ఆ వస్తువులు పోవటమే కాకుండా జైలు శిక్షా, నష్టపరిహారం విధిస్తాను, జాగ్రత్త! ఇప్పటికైనా నిజం చెప్పు!’’ అన్నాడు న్యాయాధికారి.

‘‘బాబ్బాబూ, నిజం చెప్తాను. రామయ్య చెప్పిందే నిజం! వెయ్యి రూపాయలే దాచి ఉంచి, మూడు వేలు అడిగాను. అతను నాకన్నా సిరిసంపదలతో ఎక్కువగా ఉండటం చూసి ఈర్ష్య కలిగి, అతన్ని దెబ్బకొట్టాలన్న

దురుద్దేశ్యంతో అలా అబద్ధాలాడాను. దయ ఉంచి నా ఉంగరం, గొలుసు, వెయ్యి రూపాయలు ఇప్పించేయండి; నన్ను క్షమించండి. ఇంకెప్పుడూ యిలాంటి దుష్టమైన పనులు చేయను; ఎవరికి హాని తలపెట్టను!'' అన్నాడు.

''అయ్యా, నన్ను క్షమించండి! నా కొడుకు చెప్పిన ఉపాయంతో ఈ అపాయం తప్పించుకో గలిగాను. అత్యాశగా వున్న అతనికి అసలుకే ముప్పు పెడితే దారికొస్తాడని, నా కొడుకు నా కిచ్చిన ధైర్యం, సలహా మేరకు నేను కూడా రాజయ్య నా దగ్గర ఏమీ దాచలేదని ఆబద్ధమాడాను! కానీ మరే దురుద్దేశ్యంతో కాదు. ''అసలుకు ఎసరు'' పెట్టేసరికి రాజయ్య దారికొచ్చి నిజం చెప్పాడు; కాబట్టీ మా యిద్దర్నీ క్షమించి, యివి రాజయ్యకిచ్చేయండి!'' అంటూ న్యాయాధికారికి వస్తువులూ, డబ్బూ ఇచ్చేసాడు రామయ్య.

''ఇప్పటికైనా ఇలాంటి వెధవ ఆలోచనలు, వెధవ పనులు తలపెట్టక జాగ్రత్తగా ఉండు. లోకంలో నీకన్నా తెలివైనవారు ఉండారని గ్రహించుకో!'' అంటూ హెచ్చరించి మందలించి పంపాడు న్యాయాధికారి రాజయ్యను. తండ్రీ కొడుకులిద్దరూ, న్యాయాధికారికి తమ కృతజ్ఞతలు తెలుపుకొని తమ ఇంటి దారిన తాము వెళ్ళిపోయారు.